


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 112 -

## సిల్కీ పాపాయి

**కువైట్ సిటీ.** పట్టణపు నడిబొడ్డున వున్న అహ్మద్ టవర్ లో వుంది ఒక బేబీ కేర్ సెంటర్. వుద్యోగాలకు వెళ్ళే మహిళలు తమ పిల్లల్ని అక్కడ అప్పగించి సాయంత్రం తీసుకుపోతారు.

ఆరోజు కూడా ఒక జోర్డానియన్ మహిళ ముద్దులు మూటకట్టే తన మూడు నెలల పాపను తెచ్చి ఆయాకు అప్పగించి హడావిడిగా డ్యూటీకి వెళ్ళిపోయింది. ఆ సమయంలో సిల్కీ అనే ఆ పాపాయి నిద్రపోతోంది.

ఆయా లోపల గదిలో వున్న బేబీ బెడ్ పై సిల్కీని పడుకోబెట్టి తన పనిలో మునిగిపోయింది.

రెసెప్షన్ లో వున్న రీటా పని పట్ల నిబద్ధత కలిగి వుంటుంది. డ్యూటీలో సిన్సియర్ అని పేరు పొందింది. అన్నిటినీ పొందికగా అమర్చుకుంటూ అంతా ఆర్డర్ లో వుంచుతుంది. అందుకే ఆమెను అక్కడ సూపర్ వైజర్ గా వుంచారు.

అప్పటికి పాపను అప్పగించి గంట దాటడంతో

"హేయ్ మీనా ఫోన్ పక్కనపెట్టి వెళ్ళి సిల్కీ నిద్ర లేచిందేమో చూడు. పిల్ల లేచి ఆకలితో ఏడవకముందే పాలు కలిపి పట్టించు. మొబైల్లో తలదూర్చావంటే ఈ ప్రపంచాన్నే మరిచిపోతున్నావు నువ్వు" అరిచింది రీటా.

మనసులో తిట్టుకుంటూ పైకి మాత్రం చిరునవ్వులు చిందిస్తూ "అలాగే రీటా ఇప్పుడే వెళ్ళి చూస్తాను నువ్వు కంగారు పడకు" అంటూ తీరికగా పైకి లేచింది మీనా.

"దీనికి వళ్ళంతా బద్దకమే, పని సరిగ్గా చేసి చావదు" గొణుక్కుంది రీటా.

పక్కగది గుమ్మం దగ్గర నిలబడి లోనికి తొంగి చూసిన మీనా అక్కడే ఆగిపోయి "సిల్కీ నిద్రపోతోంది రీటా..తొందరేముంది. నిద్ర లేచాక పాలు పట్టిస్తాలే" అని చెప్పి ఆయా మణెమ్మతో కబుర్లు మొదలుపెట్టింది.

వారిది ఒకే భాష, ఒకే ప్రాంతం కావడంతో వారిద్దరి మధ్యా సినిమా కబుర్లు, ఊరి విషయాలు, పక్కన పనిచేసేవారి విషయాలు బోలెడు దొర్లుతుంటాయి. మాటల్లో పడితే ఇక పరిసరాలను కూడా మర్చిపోతుంటారు వాళ్ళు.

అక్కడ వీళ్ళిద్దరే తెలుగువాళ్ళు కాబట్టి భాష ఎవరికీ అర్థం కాదనే ధీమాతో ఇష్టమొచ్చినట్లు జోకులు వేసుకుంటూ, మురిపెంగా తిట్టుకుంటూ, నవ్వుకుంటూ వుండిపోయారు.

అర్థగంట గడిచింది.

రిసెప్షన్ లో వున్న రీటాకు మీనాపై కోపం వచ్చింది. విసవిసా నడుచుకుంటూ సిల్కీ వున్న గదిలోకి వెళ్ళింది. పాలు కలిపి బాటిల్లో పోసి పాప నోటికి అందించింది. మూడు నెలల పాప సిల్కీ ఎప్పటిలా ఆత్రంగా పాల పీకను నోటితో అందుకోలేదు.

అసలు సిల్కీలో చలనమే లేదు. బుగ్గలపై తట్టి చూసింది రీటా. పాప కళ్ళు తెరవలేదు, కదలలేదు. ఏదో తేడాగా కనబడుతోంది. పాప శరీరం నీలం రంగులోకి మారడం గమనించింది రీటా. భయపడి కెవ్వుమని కేక వేసింది.

బయటవున్న వారందరూ లోపలికి పరిగెత్తుకొచ్చారు.

కళ్ళు మూసుకుని నిశ్చలంగా పడుకుని వున్న సిల్కీ దేహం నీలం రంగులో వుంది. ఏమయిందో వారికి అర్థం కాలేదు. ఏం చెయ్యాలో ఎవరికీ పాలుపోలేదు. ఒక్క నిముషం షాక్ తో మొహాలు పాలిపోయాయి. తేరుకోలేకపోయారు.

పాపాయి కదలకపోయేసరికి భయంతో వాళ్ళకు కాళ్ళూ చేతులూ వణికాయి. పాపాయికేమైనా అయితే అందరికీ ముప్పే. ఒకవేళ ఏదైనా తప్పు తమవలన జరిగివుంటే ఇక దేవుడు కూడా కాపాడలేడు.

పిల్లల విషయంలో కువైట్ చట్టం కఠినంగా వ్యవహరిస్తుంది. పిల్లల పట్ల నిర్లక్ష్యాన్ని ఏ మాత్రం సహించదు. తీవ్రమైన నేరంగా కోర్టు పరిగణిస్తుంది.

వాళ్ళలో ముందుగా తేరుకున్నది ఆయా మణెమ్మ.

వెంటనే "డాక్టర్ కు ఫోన్ చెయ్యండి" అంటూ అరిచింది.

తేరుకున్న రీటా డాక్టర్ కు, సిల్కీ తల్లికు కూడా ఫోన్ చేసి ఏడుస్తూ విషయం చెప్పింది. ఆ తల్లి డ్యూటీ నుండి పరిగెత్తుకుని వచ్చింది.

డాక్టర్ వచ్చి పరీక్షించి చూసి పెదవి విరిచాడు.

"పాపాయి ప్రాణం పోయి చాలా సేపయింది. ఇప్పటిదాకా మీరెందుకు చూడలేదు" అంటూ గద్దించాడు.

నోట మాట రాలేదు ఎవరికీ. జవాబు చెప్పడానికి కూడా ఎవరిలోను ఓపిక లేదు.

పాపను చూడనందుకు తనను తిడతారు అనుకుందేమో మీనా బుడిబుడి ఏడుపులు అందుకుంది. తోడుగా ఆయమ్మ కూడా ఏడ్వసాగింది. రీటా రాయిలా అలా నిలబడిపోయింది.

పాప తల్లి దు:ఖాన్ని ఆపడం ఎవరి తరమూ కాలేదు. "బంగారంలాంటి నా బిడ్డను మీరే చంపేసారు.. మీరే చంపేసారు" అంటూ గుండెలు బాదుకుంటోంది ఆ జోర్డానియన్ తల్లి.

పోలీసులు కూడా వచ్చి రంగంలోకి దిగారు.

దాదాపూ నెల రోజుల నుండీ సిల్కీని బేబీ కేర్ సెంటర్ లో వదిలి పెట్టి వెళుతోంది తల్లి. ముద్దులు మూట కట్టే సిల్కీ పాపాయి అంటే అందరికీ ఇష్టమే. పాపాయి బోసినవ్వులు, కేరింతలతో వారందరూ ఆనందించేవారు. పోటీపడి ఆడించేవారు.

అనూహ్యంగా ఈ దుర్ఘటన జరగడంతో అందరూ డీప్ షాక్ లోకి వెళ్ళిపోయారు. ఇక తమ జీవితాలు జైలు పాలే అనే భయంతో వణికిపోతున్నారు అందరూ. ఇలాంటి అనుభవం వారికెప్పుడూ కలగలేదు.

పిల్లలు అనారోగ్యంతో వుండి ఇబ్బంది పెట్టడం మామూలే. కానీ ఒక పాపాయ్ కేర్ సెంటర్ లో ప్రాణం కోల్పోవడం అంటే శిక్ష కఠినంగా వుంటుంది.

తమ పని అయిపోయింది. ఇక తిరిగి తమ దేశానికి వెళ్ళి తమ వారిని చూడగలమా అనే భయం వారి కళ్ళలో కదలాడింది. పాపాయిని హాస్పిటల్ కి అటునుండి అటే ఫోరెన్సిక్ ల్యాబ్ కి తీసుకెళ్ళిపోయారు.

ఇక్కడ పోలీసులు స్టాఫ్ ని వరసగా నిలుచోబెట్టి ఇంటరాగేట్ చేస్తున్నారు. రీటా మనసులో మీనాను తిట్టుకుంటోంది.

చెప్పిన వెంటనే మీనా వెళ్ళి సిల్కీని చూసి వుంటే బావుండేదేమో, పాప బ్రతికి వుండేదేమో అనుకుంటోంది.

అప్పుడు సడన్ గా ఫ్లాష్ లా ఒక విషయం గుర్తొచ్చింది రీటాకు.

తల్లి చేతిలోనుండి ఆయా బిడ్డను అందుకునే దృశ్యం ఏదో తేడాగా అనిపించింది. ఆలోచిస్తూ వుండిపోయింది రీటా.

కువైట్ పోలీస్ ప్రశ్నలలో రీటా చెప్పినప్పుడు మీనా వెళ్ళి చూడలేదనే విషయం బయటపడింది. ఇక మీనా పరిస్థితి వర్ణనాతీతం. అందరూ మీనాను దోషిలా ఏహ్యంగా చూస్తున్నారు. నీ నిర్లక్ష్యం వల్లే పాప ప్రాణం పోయింది అన్నట్లుగా ఛీ అంటూ ఈసడిస్తున్నారు.

ఇంతలో సిల్కీ తండ్రి పరిగెత్తుకుంటూ అక్కడికి వచ్చాడు. రావడంతోటే "నా బిడ్డను మీరే చంపేసారు" అంటూ మీనాను, రీటాను, ఆయాలను కొట్టసాగాడు.

అతడు కోపంతో, ఉద్రేకంతో ఊగిపోతున్నాడు. బిడ్డ పోయిన బాధలో పిచ్చివాడిలా ప్రవర్తిస్తున్నాడు.

పోలీసులు అతడిని బలవంతంగా లాగి పట్టుకోవాల్సి వచ్చింది. "మిష్టర్ అహ్మద్ రిపోర్ట్స్ రానివ్వండి.

పాప మరణానికి కారణం తెలియాలి కదా. అందుకు కారకులైన వారిని అస్సలు వదలం" అన్నాడు పోలీస్ అధికారి.

వారి మాటలు వినిపించుకునే స్థితిలో లేడు అహ్మద్. నిన్నటివరకూ గుండెలపై ఆడుకున్న బిడ్డ గురించే ఆలోచిస్తున్నాడు.

తల్లిదండ్రులకే కాదు సిల్కీని తలచుకుంటే కేర్ సెంటర్ లోని వర్కర్స్ కు కూడా బాధగానే వుంది. ఏంజల్ లా అందంగా వుండే సిల్కీ అందరి హృదయాలను దోచుకుంటుంది. చురుకైన చూపులతో ఎప్పుడూ నవ్వుతూ ముద్దుగా వుంటుంది.

అలాంటి పాప అర్ధాంతరంగా లోకాన్ని వీడిపోవడం అందరికీ మింగుడుపడని విషయం. తలబాదుకుంటూ ఏడుస్తున్నాడు తండ్రి. అతడ్ని చూస్తే జాలేస్తోంది. కన్నతండ్రికి ఎంత బాధగా వుంటుందో కదా.

మరోవైపు తల్లి దు:ఖానికి అవధులు లేవు. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కావడం లేదు.

గోడకు ఒక వైపు ఒరిగి నిలబడిన రీటా జరిగిన విషయాలను మరలా గుర్తు చేసుకోసాగింది.

ఉదయం ఎనిమిది గంటలకు వచ్చి బ్లాంకెట్ లో ముడుచుకుని పడుకున్న సిల్కీని అప్పగించి పోయింది తల్లి.

అప్పటికే సిల్కీ నిద్రపోతోంది. తరువాత తిరిగి లేవలేదు. నిజంగా సిల్కీ నిద్ర పోయిందా?

ఏదో సందేహం మనసులో పురుగులా తొలుస్తోంది. ఏదో ఆలోచన అస్పష్టంగా కదలాడుతోంది.

రిపోర్ట్స్ వస్తే కానీ ఏం జరిగిందో తెలియదు. అంతవరకూ ఈ టెన్షన్ తప్పదు. మరోవైపు సిల్కీని తలచుకుంటే భోరున ఏడవాలనిపిస్తోంది.

చేతులతో ఆడించిన పాప ఈరోజు నిర్జీవంగా మారిపోయింది. ఇదంతా తమ నిర్లక్ష్యం వల్లనే జరిగిందా..? అదే నిజమైతే..? ఊహించడానికే భయమేసి ఇక నిలిచే శక్తి లేక గోడకు చేరగిలబడింది రీటా.

ఒకరి తర్వాత మరొకరిని లోపలికి పిలుస్తూ పోలీసులు ఇంటరాగేషన్ కొనసాగిస్తూనే వున్నారు.

ఎవర్ని అడిగినా జవాబు ఒక్కటే. నిద్రపోయే పాపను తల్లి అప్పగించి పోయింది.

తరువాత పాపకు పాలు పడదామని చూస్తే నీలం రంగులోకి మారిపోయి వుంది.

పోలీసులు బేబీ కేర్ సెంటర్ ను మూసేసారు. వర్కర్స్ ని, యజమానిని కస్టడీలోకి తీసుకున్నారు. విషయం తేలేంతవరకూ వదిలేది లేదని స్పష్టం చేసారు.

దాదాపూ వారంరోజులు నరకయాతన అనుభవిస్తూ అందరూ సెల్లోనే వున్నారు. రకరకాల మాటలు, వార్తలు వారిని కంగారు పెట్టాయి.

సిల్కీ మరణానికి కారణమయిన వారిని ఉరి తీస్తారని, జీవితాంతం జైల్లో తోస్తారని ఇక తమ దేశాన్ని మరిచిపోవాలని రకరకాల ఊహాగానాలతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని కాలం గడిపారు.

దేవుళ్ళందరినీ ప్రార్థిస్తూ, కాపాడమని అర్థించారు. బయటున్న వారి బంధువులు, స్నేహితులు, వార్త తెలిసిన స్వదేశంలోని కుటుంబీకులు బెంబేలు పడ్డారు. న్యూస్ పేపర్లు రకరకాల కథనాలను ప్రచురించాయి.

కువైట్ లోని తెలుగువారికి ఇదే హాట్ టాపిక్ అయింది. మాలియాలో, ముర్గాబ్ లో కూడిన వారంతా ఇదే విషయాన్ని మాట్లాడుకుంటూ

"పాప మరణానికి కారణమయిన మీనాది ఆంధ్ర అని ఇది తెలుగువారికే అవమానమని, ఇద్దరు తెలుగువాళ్ళు కబుర్లలో పడి పాప చావుకు కారణమయ్యారని అందులో మీనా స్త్రీ జాతికే కళంకం తెచ్చిందని ఆమెను ఊరికే వదలకూడదని, ఉరి తీయాలని" రకరకాలుగా మాట్లాడుకుంటూ ఆమెను నిందించసాగారు.

కాలం భారంగా గడిచింది. రిపోర్ట్స్ వచ్చి, దర్యాప్తు ముగిసాక పోలీసులు సెల్ ను తెరిచి "మీరంతా నిర్దోషులు, సిల్కీ మరణానికి మీరు కారకులు కాదు ఇక వెళ్ళండి" అన్నారు.

నమ్మలేకపోయారు వీళ్ళు.

ఏ దేవుడు తమ మొర ఆలకించాడో తెలియదు. ముస్లింలు "యా అల్లా షుక్రియా" అన్నారు.

క్రిస్టియన్స్ "ప్రైస్ ద లార్డ్" అన్నారు. హిందూస్ తమ ఇష్ట దైవాలను తలచుకున్నారు.

బందిఖానా నుండి బయటపడ్డామన్న ఆనందంతో అందరూ ఊపిరి పీల్చుకుని బయటికి నడిచారు ఒక్క రీటా తప్ప.

రీటా అక్కడే నిలబడి "సర్ సిల్కీ పాపకు ఏమయింది..? అసలేం జరిగిందో చెప్తారా నేను తెలుసుకోవాలి" అని ఆవేదనగా పోలీసులను అడిగింది.

అక్కడున్న ఎస్సై నిట్టూర్చి "చాలా ఘోరం జరిగిందమ్మా. డాక్టర్ ఇచ్చిన రిపోర్టులో పాప ఉదయం ఐదు గంటలకే చనిపోయినట్లుగా వుంది. తల్లి గమనించకుండా పాప నిద్రపోతోందనుకుని హడావిడిగా అలాగే తీసుకొచ్చి ఇక్కడ అప్పగించింది.

తరువాత మీరు కూడా పాప నిద్రపోతుందనే అనుకున్నారు కానీ పాపది సహజ మరణం కాదు" చెప్పాడు ఎస్సై బాధగా.

సహజ మరణం కాదా విస్తుపోయింది రీటా. ముద్దులు మూటకట్టే మూడ్నెల్ల పసిపాప సిల్కీని చంపే అవసరం ఎవరికుంది..?

"సార్ సిల్కీని నెలరోజులుగా మా చేతుల్లో పెంచాం. దయచేసి విషయం చెప్పండి. ఇందులో మా పొరపాటు లేదు కదా" అంది ఏడుస్తూ.

"ఏం చెప్పమంటావమ్మా ఆ దుర్మార్గుడు సిల్కీ కన్నతండ్రే బిడ్డను పొట్టన పెట్టుకున్నాడు. మరలా ఏమీ ఎరగనట్టు ఇక్కడికొచ్చి మీ అందరినీ తిడుతూ, కొడుతూ, ఏడుస్తూ నాటకాలాడి భీభత్సం సృష్టించాడు. మాకు అనుమానం వచ్చి ఆ కోణంలో విచారణ జరిపాము. అక్కడే అసలు నిజం బయటపడింది.

వాడికి భార్య మీద తగని అనుమానం. సిల్కీ తనకు పుట్టింది కాదని నిందిస్తూ వాడు ప్రతిరోజూ భార్యతో గొడవ పెట్టుకునే వాడట. పాప పుట్టినప్పటినుండీ గొడవ ఎక్కువై ఏదో ఒకరోజు సిల్కీని చంపేస్తా అని అరిచేవాడట.

చివరికి తెగించి ఆరోజు ఉదయం నిద్రపోతున్న పాప గొంతు నులిమి చంపేసాడు. రాస్కెల్ వాడిని జైల్లో వేసి తోలు తీస్తాము. తగిన శిక్ష పడేలా చూస్తాము. ముక్కుపచ్చలారని పసిబిడ్డను పొట్టన పెట్టుకున్న రాక్షసుడు వీడు" చెప్పాడు ఆవేశంగా ఎస్.ఐ.

ప్రాన్పడి పోయింది రీటా. కన్నీళ్ళు జలజలా రాలాయి. భారమైన హృదయంతో సిల్కీ పాపకు నివాళులు అర్పిస్తూ బయటికి నడిచింది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments